ఆంక్షలు ఆవిరై.. ఆనందం ఆవిష్కృతమై..

కూటమి కుట్రలను ఛేదించి ఉప్పెనలా తరలివచ్చిన ప్రజలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరాకుండా పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. బుధవారం రాత్రి నుంచే నగరంలో అష్టదిగ్బంధం విధించి ప్రజలు ఒకచోట చేరకుండా అనేక ప్రయత్నాలు చేశారు. అయినా ప్రజలు ఉప్పొంగిన అభిమానంతో పోలీసుల ఆంక్షలను ఛేదించి జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. 'జై జగన్.. కాబోయే సీఎం జగనన్న' అంటూ నినాదాలు హోరెత్తించారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి


కేరింతలు కొడుతున్న చిన్నారులు

నెల్లూరు (టౌన్)/ నెల్లూరు సిటీ/ నెల్లూరు(వీఆర్సీ సెంటర్)/ నెల్లూరు(బృందావనం): నగరంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జిల్లా జైలులో కాకాణిని పరామర్శించిన తరువాత ఆయన అయ్యప్పగుడి సెంటర్‌కు మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకున్నారు. ఈ క్రమంలో నల్ల టీషర్టులు ధరించిన కొందరు రోడ్డుపైకి కార్యకర్తలు, అభిమానులు రాకుండా నిలువరించినా ఆగలేదు. అప్పటికే పెద్ద సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు, అభిమానులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం దగ్గరకు వెళ్లి జై జగన్ నినాదాలు చేశారు. వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా లెక్క చేయకుండా కాబోయే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కరచాలనం తీసుకునేందుకు పోటీ పడ్డారు.

పోలీసుల ఓవరాక్షన్

వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా పోలీసులు కర్ఫ్యూను తలపించేలా ఓవర్ యాక్షన్ చేశారు. నగరంలోని కరెంటాఫీసు సెంటర్ వద్ద బందోబస్తు చేస్తున్న పోలీసులు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని సైతం అడ్డగించారు. అంతేకాక ఈ ప్రాంతంలో ఉన్న టిఫిన్, హోటల్స్, దుకాణాలను బలవంతంగా మూయించారు. స్థానిక బ్యాంక్‌కు వచ్చే ప్రజలను సైతం నిలువరించే ప్రయత్నాలు చేశారు. కరెంటాఫీసు సెంటర్ వద్ద యువజన నాయకుడు ఊటుకూరు నాగార్జున నేతృత్వంలో పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు రోడ్లపైకి రావడంతో పోలీసులు చేసేది లేక చేతులెత్తే పరిస్థితి ఏర్పడింది.

బొబ్బల శ్రీనివాసులుయాదవ్‌పై పోలీస్ జులుం

వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులుయాదవ్ ఎంజీబీ నుంచి ప్రసన్న నివాసం వైపు తన అనుచరులతో బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు ఓవరాక్షన్ చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, రోప్‌తో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు చివరికి బొబ్బల శ్రీనివాసులుయాదవ్‌ను మాత్రమే పంపించేందుకు అంగీకరించారు. కాగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసే విషయంలో కూడా వాగ్వాదం చోటుచేసుకుంది.

శివారు ప్రాంతాల్లో..

నగర శివారు బుజబుజనెల్లూరుకు సమీపంలో చెముడుగుంట పరిధిలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారానికి రాకపోకలు సాగించే మార్గాలను గురువారం వేకువజాము నుంచే పోలీసులు తమ ఆధీనంలో తెచ్చుకున్నారు. పొదలకూరురోడ్డులోని కొత్తూరు వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే కొత్తూరు నుంచి రామకోటయ్యనగర్ కూడలి నుంచి వైఎస్సార్ నగర్ మార్గంలో జిల్లా కేంద్ర కారాగారానికి దారితీసే మార్గంలో శ్రామికనగర్ వద్ద బారికేడ్లతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరినీ పరిశీలిస్తూ వారి వివరాలను తెలుసుకొంటూ బైక్‌లపై వెళ్లే వారిని మాత్రమే బుజబుజనెల్లూరు, వైఎస్సార్ నగర్, శ్రామికనగర్‌ల వైపు అనుమతించారు.


ప్రసన్న ఇంటి నుంచి అభివాదం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి





ప్రసన్న తల్లికి ఆత్మీయ పలకరింపు

ధాన్యం కొనడం లేదు.. జగనన్నకు చెబుదామని వచ్చాం



ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో కొనేవారు లేరు. 860 కిలోల షుగర్‌లెస్ ధాన్యం జగనన్న హయాంలో రూ.29 వేల అమ్మాం. ఇప్పుడు రూ.22 వేలకు కూడా కొనే దిక్కులేదు. వేలాది క్వింటాళ్ల ధాన్యం సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని రైతుల వద్ద ఉంది. రైతుల సమస్యను చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసింది. మా సమస్యలను జగనన్నకు చెబుదామని వచ్చాం.

– పాముల హరినాథ్, గుడ్లూరివారిపాళెం, సర్వేపల్లి నియోజకవర్గం

చిన్ననాటి కల



'నా ఊహ తెలిసినప్పటి నుంచి జగనన్న అంటే అభిమానం. చచ్చేలోపు నిన్ను కలుస్తా.. చచ్చే వరకు ని అభిమానిగా ఉంటా.. ఐ లవ్ యు జగనన్న' అంటూ ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని సంజీవరాజుపల్లెకు చెందిన బి.అనిల్ అనే యువకుడు జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో ఉన్న బనియన్ ధరించి వచ్చారు. తాను జగన్ననను కలవాలంటూ వినతిపత్రంతో వేచి ఉన్నారు. అయితే ఎస్సై అయ్యప్ప అందుకు వీలుపడదంటూ వినతిపత్రాన్ని అనిల్ నుంచి గుంజుకున్నారు. అది చూస్తున్న సర్వేపల్లి, ఉదయగిరి, కావలి ప్రాంతానికి చెందిన అభిమానులు, కార్యకర్తలు ఎస్సైతో వాగ్వాదానికి దిగారు. అయినా ఎస్సై అయ్యప్ప ఆ వినతిపత్రాన్ని ఇవ్వలేదు. పోలీసుల తీరుపై అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి తన వాహనంపై నుంచి అభివాదం చేస్తున్న సమయంలో అనిల్ తన వద్ద ఉన్న మరో వినతిపత్రాన్ని సెక్యూరిటీకి అందజేసి తన పంతం నెగ్గించుకున్నారు.

సుజాతమ్మ కాలనీ అష్ట దిగ్బంధనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జగనన్న పర్యటన నేపథ్యంలో మాజీ మంత్రి ప్రసన్న నివాసముంటున్న సుజాతమ్మ కాలనీవాసుల కష్టాలు బుధవారం రాత్రి నుంచే మొదలయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు కాలనీ వాసులను ఖైదీల కంటే దారుణంగా చూశారు. పొదలకూరు రోడ్డు సెంటర్ నుంచి కొండాయపాళెం గేటు వరకు వెళ్లే మెయిన్‌రోడ్డును నడవాడినికి కూడా వీలు లేకుండా మూసేశారు. దీంతో పాటు ఎస్పీ బంగ్లా నుంచి ప్రసన్న ఇంటి వైపు వెళ్లే రోడ్డును సైతం ఇనుప కమ్ములు, తీగలతో మూసివేయడం వల్ల బుధవారం రాత్రి నుంచి కాలనీలోని ఎనిమిది వీధుల ప్రజలు అల్లాడారు. ఉదయం స్కూల్‌కు వెళ్లే పిల్లలు, ఆఫీసులకు వెళ్లేవారు కూడా నానా కష్టాలు పడ్డారు.


నడిచేందుకు వీలు లేకుండా ఏర్పాటు చేసిన ముళ్ల ఫెన్సింగ్‌లు, బారికేడ్లు


మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌ను నిలిపివేసిన పోలీసులు

➡ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఖలీల్ అహ్మద్‌ను ఆ వీధుల గుండా నడిచి కూడా వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. డిప్యూటీ మేయర్‌గా పనిచేశానని, తమ పార్టీ నాయకులు ప్రసన్న ఇంటి వద్ద ఉన్నారని ఎన్ని విధాలుగా చెప్పినా పోలీసులు ఒప్పుకోలేదు. దీంతో అక్కడ స్థానికులు, పోలీసులు తీవ్ర ఘర్షణ పడ్డారు. అలానే పొదలకూరు, తాటిపర్తి, ఆత్మకూరు తదితర సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కూడా అడ్డుకుని అక్కడి నుంచి పంపించేసి పోలీసులు ఓవరాక్షన్ చేశారు.

క్లుప్తంగా

వ్యాధులపై అవగాహన



నెల్లూరు (టౌన్): స్థానిక వైవీఎం మున్సిపల్ స్కూల్లో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో కీటక జనిత, సీజనల్ వ్యాధులపై గురువారం విద్యార్థులను అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జున రావు హాజరై, వ్యాధుల నివారణ మార్గాలను వివరించారు. హెచ్‌ఎం జాస్మిన్, వైద్యశాఖ అధికారులు శ్యాంసన్‌బాబు, రామారావు, కరుణమ్మ, గురవయ్య, ఏఎన్‌ఎం సునీత పాల్గొన్నారు.

వైద్యాధికారి ప్రసూన మృతి


డాక్టర్ ప్రసూన (ఫైల్)

నెల్లూరు(అర్బన్): గూడూరు వద్ద ఉన్న చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ప్రసూన(55) బుధవారం అర్ధరాత్రి నెల్లూరు నిప్పో ఫ్యాక్టరీ వద్ద ఆమె నివాసంలో మరణించారు. విషయం తెలిసిన ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డేనియల్, డాక్టర్ శేషమ్మ, మజరుల్లా, గౌస్‌బాష తదితరులు గురువారం వెళ్లి ప్రసూన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో మలేరియా అధికారిగా, పలు పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్‌గా ఆమె పనిచేశారన్నారు. ప్రతిచోటా మంచి పేరు తెచ్చుకున్నారు.

విరాళం అందజేత



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వార్ల శయన, పొన్నుసేవలకు పూలమాలలు, ప్రసాద వినియోగానికి ఆరణికందప్ప మేస్త్రి సత్రం వారు రూ.98 వేలు అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డికి గురువారం అందజేశారు.

జట్ల కొండూరులో పొలం పిలుస్తోంది



మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలన్నారు. యూరియా ఎక్కువగా వాడటం వల్ల వరిలో పురుగులు, తెగుళ్లు ఎక్కువయ్యే ప్రమాదం ఉందన్నారు.

నేషనల్ మానిటరింగ్ టీమ్ పరిశీలన



ఇందుకూరుపేట: నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. తొలుత కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కొత్తూరులో ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఇందుకూరుపేటలో అరటి వ్యర్థాల నుంచి ఉప ఉత్పత్తుల తయారీ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, పలు అంశాలపై పరిశీలించారు. బృంద సభ్యులు ప్రశాంత్‌కుమార్, మణికండన్ తదితరులు పాల్గొన్నారు.

దేవుని మాన్యంలో తవ్వకాలు

చేజర్ల (సోమశిల): చేజర్ల మండలం కాకివాయిలోని కోటితీర్థం త్రికోటేశ్వరస్వామి ఆలయానికి చెందిన సుమారు 40 ఎకరాల భూమిని జీకే ల్యాండ్స్ ప్రైవేట్ సంస్థ వారు లీజుకు తీసుకున్నారు. దేవుని మాన్యాన్ని పొడుకున్నవారు పంటలు సాగులు చేసుకోవాలి. కానీ భూముల్లో ఇష్టానుసారంగా భారీ గుంతలు తవ్వడంపై గ్రామస్తులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ మాన్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారని, సంబంధిత అధికారులు పరిశీలించి తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన మహాకుంభాభిషేకం



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి దేవస్థానంలో విమానగోపురం, జీవధ్వజ, నవగ్రహ మండప పునఃప్రతిష్టను పురస్కరించుకుని నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మహాకుంభాభిషేక మహోత్సవం గురువారంతో పరిసమాప్తమయ్యాయి. కంచిపీఠ ఆస్థాన సిద్ధాంతి ఎల్.విజయసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మహాగణాధిపతి పూజ, వేదపారాయణం, నవగ్రహ, జీవధ్వజ విమాన ప్రతిష్ట, అష్టబంధనం, మహాకుంభాభిషేకం, అమ్మవారి దివ్యదర్శనం, మహాపూర్ణాహుతి, శిఖరంపై నుంచి బూరెలు పోయడం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపురం పునఃనిర్మాణ దాతలు ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి, రాధిక, నవగ్రహ మండపం దాతలు పసుపులేటి సుబ్రహ్మణ్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకుడు ఎస్.రఘురామమూర్తి పర్యవేక్షించారు.

కుళాయి పన్నులను వసూలు చేయండి


మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ కౌన్సిల్ సమావేశం మందిరంలో వారాంతపు సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. నగరంలోని అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతు జానీ పాల్గొన్నారు.

➡ 'స్మార్ట్ స్ట్రీట్ బజార్' ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. స్థానిక మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలో కంటైనర్ ఫుడ్ కోర్టులను గురువారం పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.

➡ పీ–4 కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చెందిన కుటుంబాలు ఆపన్నులకు సహాయ సహకారాలు అందించాలని కమిషనర్ నందన్ ఆకాంక్షించారు. ఈ మేరకు మార్గదర్శి బాధ్యతలు స్వీకరిస్తూ నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు ఖాసీం, ఏవీ సుబ్బారావులు చెరో మూడు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కమిషనర్ నందన్ తన కార్యాలయంలోని గురువారం వారిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సరస్వతి నగర్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో అంతరాయాలు ఉంటాయని ఆశాఖ టౌన్ ఈఈ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతి నగర్, రామ్‌నగర్, పాత మిలటరీ కాలనీ, క్రాంతినగర్, టెక్కేమిట్ట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(పొగతోట): ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఈనెల 5వ తేదీ నుంచి 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులోని ఏపీజీఈఏ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, ఉద్యోగులకు ఆమోదయోగ్యమయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాంప్రసాద్, సిటీ అధ్యక్షుడు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

నెల్లూరు(పొగతోట): మండల సమాఖ్యల్లో ఖర్చులు, ఆదాయం, దానికి సంబంధించిన పూర్తి వివరాలు సక్రమంగా రికార్డుల్లో నమోదు చేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీఎంలు, ఎల్‌సీలకు నిర్వహించిన సమీక్షలో పీడీ గురువారం మాట్లాడారు. జిల్లాలోని ఎల్‌సీలు ప్రతినెలా లావాదేవీలకు సంబంధించి రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. వస్తున్న ఆదాయం, ఖర్చులు, దానికి సంబంధించిన పూర్తి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో వెలుగుచూసిన యాక్సిస్ బ్యాంక్ కుంభకోణంపై భవిష్యత్ కార్యాచరణకు అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. ఆగస్టు 2న నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశానికి పలు రాజకీయ పార్టీ నాయకులకు ఆహ్వాన పత్రాలను గురువారం అందజేశారు. ఈ మేరకు ఆయన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తదితరులు ఉన్నారు.

